క్లుప్తంగా

మౌలిక సదుపాయాల కల్పన



సెంచూరియన్ వీసీ జీఎస్ఎన్ రాజుతో చర్చిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు సుముఖత వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వరరెడ్డి, సమగ్ర శిక్ష కన్సల్టెంట్ సోనాలి సింగ్, విద్యారంగ నిపుణులు డాక్టర్ సోనూల్ తదితరులు వర్సిటీని మంగళవారం సందర్శించారు. ప్రభుత్వం వందలాది మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిన నేపథ్యంలో యూనివర్సిటీ నుంచి పూర్తిసహకారం కావాలని వీసీ జీఎస్ఎన్ రాజును ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమణారావు, డీన్ సన్నీ డియోల్, డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సెల్ ఉపాధ్యక్షుడికి సత్కారం



అప్పలకృష్ణను సత్కరిస్తున్న గ్రామస్తులు

విజయనగరం రూరల్: జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు, మండల ప్రసార కమిటీ అధ్యక్షుడు అప్పలకృష్ణను గ్రామస్తులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల నిర్వహించిన జిల్లా బీసీ సంఘం సమావేశంలో ఉపాధ్యక్షుడిగా అప్పలకృష్ణ ఎన్నికవడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి సంఘ పరంగా తన వంతు కృషి చేస్తానన్నారు.

ఎంఈఓ - 1 బాధ్యతల స్వీకరణ

నెల్లిమర్ల: మండల విద్యాశాఖ అధికారిణి - 1గా బి.విజయకుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లిమర్ల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న ఆమెకు ఎంఈఓ - 1గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ - 2 ఈపు విజయ్‌కుమార్‌ను కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లిమర్ల నగర పంచాయతీ, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మండలానికి చెందిన హెచ్ఎంలు ఆమెను కలిసి అభినందనలు తెలియజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

విజయనగరం ఫోర్ట్: మండల పరిధిలోని పలు గ్రామాలకు గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎస్ఈ ముప్వల లక్ష్మణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా అంతరాయం కలగనున్నట్టు పేర్కొన్నారు. అయ్యన్నపేట, అయ్యన్నపేట జంక్షన్, పాల్‌నగర్, దుప్పాడ, చిల్లపేట, జొన్నవలస, పినవేమలి, రాకోడు, సారిక, కోరుకొండ, కోరుకొండ పాలేం, కోరుకొండ కొత్తూరు, అట్టాడ, దత్త రాజ్ గార్డెన్, గుంకలాం, గుంకలాం జగనన్న కాలనీ, నందాం గ్రామాలకు ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు దీన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

నల్లమారమ్మ తల్లి ఆశీస్సులు అందరిపైనా ఉండాలి



అన్న సమారాధనలో పాల్గొన్న సిరి సహస్ర

విజయనగరం టౌన్: స్థానిక బాబామెట్ట డబుల్ కాలనీలో వేంచేసి ఉన్న నల్లమారమ్మ దేవీ ఆశీస్సులు అందరిపైనా ఉండాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరి సహస్ర పేర్కొన్నారు. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆమె అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలను సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నప్రసాదాన్ని స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి : డీఎస్పీ

విజయనగరం క్రైమ్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు సూచించారు. స్థానిక వన్‌టౌన్, టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లను స్టేషన్‌కి పిలిపించి మంగళవారం వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర ప్రవృత్తిని విడనాడాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలను చేయవద్దన్నారు. వారి ప్రవర్తన శైలి బట్టి రౌడీషీట్లు ఎత్తివేసే అవకాశం ఉంటుందన్నారు. కుటుంబంలో పెద్దగా ఉండాల్సిన వ్యక్తి తెలిసో, తెలియక చేసిన తప్పులకు కుటుంబ సభ్యులు బాధపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. సీఐ సీహెచ్ లక్ష్మణరావు, ఎస్ఐలు అశోక్‌కుమార్, రామగణేష్, షేక్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’తో సత్వర సేవలు

- రూ.16 వందల కోట్లతో సంక్షేమాభివృద్ధి
- నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: ప్రజలకు 11 రకాల ప్రభుత్వ సేవలు సత్వరం అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రజాప్రతినిధులు, సచివాలయ అధికారులు, సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ దేశంలో ఇక్కడా లేనన్ని సంక్షేమ పథకాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. గ్రామస్థాయిలోనే ప్రభుత్వ సేవలు ప్రజలకు అందించాలన్న మహోన్నత లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. దీనికి తోడుగా వలంటీర్లను ఏర్పాటు చేసి సేవలను ప్రజల ఇంటి ముంగిటకు తెచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. దీంతో లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగించారన్నారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి గ్రామాల్లోనే రైతులకు ఎరువులు, విత్తనాలు,



హాజరైన గ్రామ సచివాలయ అధికారులు, ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు తదితరులు

పంటసాగు సలహాలు, సూచనలు అందిస్తున్నారని తెలిపారు. వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారని వివరించారు.

సంక్షేమాభివృద్ధికి రూ.16వందల కోట్లు ఖర్చు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నెల్లిమర్ల నియోజకవర్గంలో రూ.16 వందల కోట్ల 33 లక్షల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేశారని ఎమ్మెల్యే అప్పలనాయుడు అన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు.

చంద్రబాబును మోసేందుకే పవన్

చిరంజీవి మాదిరిగానే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాజకీయ వైఫల్యం శతశాతం ఖాయమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. రాజకీయంగా వారి ఎదుగుదల కంటే చంద్రబాబు ఎదగాలన్న కోరిక పవన్‌లో అధికంగా కనిపిస్తోందన్నారు. దీనిని ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీలు పిన్నింటి తమ్మునాయుడు, కూరాకుల అనిత, ఎంపీడీవో డీడీ స్వరూపారాణి, తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, డెంకాడ, పోలిపల్లి పీఏసీఎస్‌ల అధ్యక్షులు రొంగలి కనకసింహాచలం, బాలి సత్యనారాయణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’ను వినియోగించుకోవాలి

నెల్లిమర్ల: సంక్షేమ పథకాల అమలులో అడ్డంకులు తొలగించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అన్ని వర్గాల ప్రజలు వినియోగించుకోవాలని నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేట 20వ వార్డులో వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బందితో కలిసి మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరిగి కార్యక్రమం ఆవశ్యకతను వివరించారు. నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు తదితరులు పాల్గొన్నారు.

‘సంక్షేమం’లో రాష్ట్రం దేశానికే ఆదర్శం



లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: సంక్షేమ పథకాల అమలులో దేశానికి ఆదర్శంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని ముక్కాం సచివాలయ పరిధిలో కొండ్రాజుపాలెం, బోడిపిల్లిపేట గ్రామాల్లో మంగళవారం రెండో రోజు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగించారు. ప్రతి ఇంటికి వెళ్లి పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎప్పుడైనా ఇన్ని పథకాలు మీకు అందాయా అని గ్రామస్తులను అడిగారు. గత ప్రభుత్వంలో ప్రతి పనికి జన్మభూమి కమిటీలు పేదలను పీల్చి పిప్పి చేశాయని, ఇప్పుడు జగనన్న పాలనలో నేరుగా ఇంటికే పథకాలు అందటం మీరు చూస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేశంలో మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా ఉందన్నారు. గత టీడీపీ పాలనలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప చంద్రబాబు అండ్ కో ప్రజలకు చేసిన ఒక్క మేలు లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ సూరాడ రాములమ్మ, సూరాడ చిన్నారావు, మత్స్య శాఖ డైరెక్టర్ నరసింహులు, పడాల భానుప్రకాశ్, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, కర్రోతు వెంకటరమణ, కిలారి వెంకటరమణ, కర్రోతు శ్రీనివాసరావు, వాసుపల్లి రొయ్యుడు, పతివాడ రామకృష్ణ, ఎరుపల్లి పెద్దయ్య, దుక్క రమణ, తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన సాగిస్తున్నారని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కొత్తగా మంజూరైన పింఛన్ల లబ్ధిదారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గడప గడపకు గ్రామ వలంటీర్లతో ప్రభుత్వ సేవలు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రతి నెల అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్న ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా మండలంలో కొత్తగా మంజూరైన 275 పింఛన్ దారుల ధ్రువపత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంట వెంకట్రావు, పంచాయతీ విస్తరణాధికారి డి.తిరుపతి నాయుడు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని వివరిస్తూ..
సమస్యలు తెలుసుకుంటూ..



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తదితరులు

- నగరంలోని 9వ డివిజన్‌లో ‘గడప గడపకు మన ప్రభుత్వం’

విజయనగరం: నగరంలోని 9వ డివిజన్ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పాల్గొని.. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు గడిచిన నాలుగేళ్లలో అందిన పథకాల లబ్ధి ఏ మేరకు అందిందో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాలనపై సంతృప్తి స్థాయిని ఆరా తీశారు. కొన్ని చోట్ల వీధి దీపాలు, కాలువల సమస్యలను స్థానికులు ప్రస్తావించగా.. వెంటనే సంబంధిత అధికారులతో డిప్యూటీ మేయర్ మాట్లాడి, పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జి అల్లు చాణక్య మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని తెలిపారు. సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా శాసనసభ ఉప సభాపతి, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి కృషి చేస్తున్నారన్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేయడంతో పాటు.. పేదల ఆకలిని తీర్చే విధంగా ఫుడ్ బ్యాంకులను ఏర్పాటు చేసిన ఘనత కోలగట్ల వీరభద్ర స్వామికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పివిడి.ప్రసాదరావు, కార్పొరేటర్ షకీల్, పిలకా శ్రీను, లంక మధు, రవి, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో కోనేరు అభివృద్ధి



కోనేరును పరిశీలిస్తున్న జేఈ, వైస్ చైర్మన్ తదితరులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో ఉన్న శివాలయం వద్ద కోనేరును ఎంపీ నియోజకవర్గ అభివృద్ధి నిధులతో అభివృద్ధి చేయనున్నట్టు పంచాయతీరాజ్ జేఈ అశోక్, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు తెలిపారు. ఈ మేరకు జరజాపుపేటలోని శివాలయం కోనేరును స్థానిక పెద్దలతో కలిసి మంగళవారం పరిశీలించారు. కోనేరు చుట్టూ గట్టు నిర్మాణం, మెట్ల ఏర్పాటు, గార్డెనింగ్ తదితర ఏర్పాట్లతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడి చొరవతో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ దీని కోసం అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, తుమ్మ నారాయణమూర్తి, నల్లి శ్రీను, తాలాడ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట నిరసన



డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట నిరసనలో పొదుపు సంఘం సభ్యులు

విజయనగరం అర్బన్: జిల్లాలోని ఎల్.కోట మండలం కళ్లేపల్లి గ్రామానికి చెందిన పొదుపు సంఘాల సభ్యులకు జరిగిన అక్రమాలకు కారకులైన వారిని అరెస్టు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పొదుపు సంఘాల సభ్యులతో కలిసి స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయ భవనం ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పొదుపు సంఘం సభ్యులు మాట్లాడుతూ లేని అప్పులకు నోటీసులు ఇవ్వడం అన్యాయమని ఆరోపించారు. సంబంధిత బ్యాంక్ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. స్త్రీనిధి సొమ్ము ఒక గ్రూప్‌కి రూ.2.5 లక్షలు అని చూపిస్తూ రూ.లక్ష మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. మిగిలిన రూ.1.5 లక్షలు ఏమవుతున్నాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, ఆ గ్రామ పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

- క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్న డీఎంహెచ్‌ఓ
- వారంలో మూడు రోజుల పర్యటన



రెల్లివలస పీహెచ్‌సీ వద్ద ఏఎన్ఎం ట్యాబ్‌లో వివరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నారా లేదా అని తెలుసుకునేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పరిశీలన చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం పర్యటిస్తూ సిబ్బంది పనితీరును తెలుసుకుంటున్నారు. జిల్లాలో ఉన్న పీహెచ్‌సీలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు పరిశీలించనున్నారు.

వారంలో మూడు రోజులు పర్యటన

డీఎంహెచ్‌ఓ వారంలో మూడు రోజుల పాటు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. బుధ, గురు, శుక్ర వారాల్లో పర్యటిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు వారికి ఇచ్చిన ట్యాబ్‌లో వ్యాధుల వివరాలు, గర్భిణుల వివరాలు, పిల్లల వివరాలు, వ్యాధి నిరోధక టీకాల వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. డీఎంహెచ్‌ఓ పర్యటన సమయంలో ఏఎన్ఎంలు యాప్‌లో నమోదు చేసిన వివరాలు కచ్చితంగా ఉన్నాయో లేదో పరిశీలిస్తున్నారు. అదేవిధంగా పీహెచ్‌సీలో వస్తున్న రోగులకు వైద్య సేవలు ఏ విధంగా అందిస్తున్నారు.. తదితర అంశాలను పరిశీలించి అప్‌లోడ్ చేస్తారు.

క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నాం..

వారంలో మూడు రోజులు పర్యటిస్తున్నాం. పరిశీలన అంశాలను అదో రోజు యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. క్షేత్ర స్థాయిలో పర్యటించడం వల్ల సిబ్బంది ఏ విధంగా పని చేస్తున్నారన్నది తెలుస్తుంది. అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది.

– డాక్టర్ ఎస్. భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

సచివాలయాల పరిశీలన



సచివాలయాలను పరిశీలించిన నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీరాములనాయుడు

విజయనగరం: నగరంలోని 1, 2, 3, 4 నంబర్ల సచివాలయాలను నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీరాములనాయుడు మంగళవారం పరిశీలించారు. సచివాలయాల వారీగా అందుతున్న పౌర సేవలపై ఆరా తీసారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు సచివాలయాల వారీగా ఎన్ని సర్వీసులకు అప్లోడ్ చేశారు వంటి అంశాలపై క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. మెరుగైన పౌర సేవలు అందించడంతో పాటు జగనన్న సురక్ష పథకం శతశాతం మెరుగైన ఫలితాలు వచ్చే విధంగా కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలని సూచించారు.

ఆంజనేయులకు జర్నలిస్టుల ఘన నివాళి



ఆంజనేయులు చిత్రపటం వద్ద జర్నలిస్టుల నివాళి

విజయనగరం అర్బన్: జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ నాయకుడు అంబటి ఆంజనేయులు తన వంతు కృషి చేశారని ఏపీయూడబ్ల్యూజే సభ్యులు పేర్కొన్నారు. జర్నలిస్టు యూనియన్ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకూ ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఇటీవల అనారోగ్య కారణంగా ఆంజనేయులు మృతి చెందడం పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. జర్నలిస్టుల హక్కుల కోసం పోరాటం జరుగుతున్న దశలో ఆయన లేకపోవడం తీరని లోటని పలువురు వ్యాఖ్యానించారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో అంబటి ఆంజనేయుల చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు జర్నలిస్టులు శ్రద్ధాంజలి ఘటించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి పంచాది అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు శివప్రసాద్, సీనియర్ జర్నలిస్టులు ఎలిశెట్టి సురేష్‌కుమార్, మహాపాత్రో, లక్ష్మణరావు, విజయభాస్కర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ సభ్యులు, వివిధ పత్రికల జర్నలిస్టులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



జగనన్న సురక్షపై సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీఓ రామారావు తదితరులు

పూసపాటిరేగ: అర్హత వున్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలని ఎంపీడీఓ జి.రామారావు అన్నారు. మండలంలోని సిహెచ్.అగ్రహారం గ్రామంలో జగనన్న సురక్షపై గ్రామంలో ఇంటింటికి వెళ్లి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చారన్నారు. జూలై 1 నుండి కార్యక్రమం ప్రారంభం అవుతోందన్నారు. గ్రామాలలో ఇప్పటికే సమస్యలపై వలంటీర్లుతో కలిపి సచివాలయం సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసురావు, సర్పంచ్ కొత్తకోట శ్రీరాములు, కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.